# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :272 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి గురువారం 8 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :272 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI THU 8 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం



- 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం
- భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

- మిగతా 2లో

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా
- విశాఖ ఎకనామిక్ రీజియన్ త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందన్న కేంద్ర మంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం,

- మిగతా 2లో

## ఢిల్లీలో సీఎం చంద్రబాబు.. నిర్మలా సీతారామన్‌తో భేటీ,

# రాష్ట్ర ప్రాజెక్టులపై చర్చ

- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చ
- రెండు రోజుల పర్యటనలో ప్రధాని, పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం
- విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాల నిధులపై విజ్ఞప్తి చేసే అవకాశం
- నేడు సీఐఐ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జీహెచ్ హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'విజయవాడ ఉత్సవ్'కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టీడీపీ ఎంపీలు, నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.

(అక్టోబర్ 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని నేడు రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోదీ 25 ఏళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.



# రణరంగంగా మారిన ఢిల్లీ..

# రాహుల్, ప్రియాంక అరెస్ట్..

### బలవంతంగా వాహనంలోకి ఎక్కించిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్: జంతర్ మంతర్ వద్ద లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని, ప్రియాంకా వాద్రాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , 'ఓట్ చోరీ' ఆరోపణలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ INDIA కూటమి ఎంపీలు అక్టోబర్ 7న బుధవారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగారు.అయితే నిరసనకు అనుమతి లేదంటూ పోలీసులు రాహుల్ ను, విపక్ష ఎంపీలను అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు ,కాంగ్రెస్ నేతలకు వాగ్వాదం, తోపులాట జరిగింది. తమపై పోలీసులు దాడి చేశారని,

- మిగతా 2లో



## డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు,

- మిగతా 2లో

## ఏపీలో మరో 58 వేల మందికి 'తల్లికి వందనం'.. క్యాబినెట్ నిర్ణయం




- 'తల్లికి వందనం' పథకం విస్తరణకు కేబినెట్ ఆమోదం
- కొత్తగా 58,601 మంది విద్యార్థులకు అందనున్న ప్రయోజనం
- మొత్తం లబ్ధిదారుల సంఖ్య 68 లక్షలు దాటిన వైనం
- దసరా పండుగ లోపు తల్లుల ఖాతాల్లో నగదు జమ

- మిగతా 2లో



## ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

### భవిష్యత్తులో టీ, సమోసాలు తింటూ చర్చిస్తామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఇండియా కూటమి ఐక్యత మరోసారి ప్రశ్నార్థకమైంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఏర్పాటు చేసిన విందుకు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ గైర్హాజరయ్యారు. ఈ పరిణామంపై ఆయన చేసిన వ్యాఖ్యలు

- మిగతా 2లో

## డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

- డిసెంబర్‌లో రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు పెరగొచ్చని అంచనా
- తాజాగా 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన ఆర్‌బీఐ
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ అనిశ్చితి దీనికి ప్రధాన కారణాలు
- డిసెంబర్ నాటికి రెపో రేటు 6 శాతానికి చేరొచ్చన్న ఎస్‌బీఐ రీసెర్చ్




- మిగతా 2లో

## 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే.. అవినీతి అనుకోవాలా?'



పెన్ పవర్ డెస్క్: టీవీకే అధినేత, నటుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో సుమారు రూ. 30 కోట్ల విలువైన ఆస్తులు వెల్లడించలేదన్న పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఆస్తుల వివరాలు వెల్లడించకపోవడాన్ని నేరుగా 'అవినీతి

- మిగతా 2లో



## రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

- రసాయన శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ప్రకటన
- ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్సో సోయ్‌లకు పురస్కారం
- అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం
- ఔషధాలు, పరిమళాల తయారీలో కీలకం కానున్న ఈ ఆవిష్కరణలు

- మిగతా 2లో

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి ఛార్జీలు
- ఈ ఛార్జీల వల్ల లావాదేవీల పరిమాణం తగ్గదని ఆర్బీఐ గవర్నర్ స్పష్టత
- ఈ రుసుముల వల్ల కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని కేంద్రం వెల్లడి
- వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ బదిలీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు

పెన్ పవర్ డెస్క్:యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# దేశం పరువు పోయిందిగా..

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు.

### తక్షణమే పదవి నుంచి వైదొలగాలని...

జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింది.

### పదమూడు కోట్ల ఓట్లను...

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ుా×= ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో 58 వేల మందికి 'తల్లికి వందనం'.. క్యాబినెట్ నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం పరిధిని విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద కొత్తగా మరో 58,601 మంది విద్యార్థులను అర్హులుగా చేర్చుతూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పథకం ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య మరింత పెరగనుంది.

తాజా చేర్పులతో రెండో విడతలో ఆర్థిక సహాయం అందుకునే విద్యార్థుల సంఖ్య 3,29,201కి చేరుకుంటుంది. ఫలితంగా, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హులైన మొత్తం విద్యార్థుల సంఖ్య 67,47,190 నుంచి 68,05,791కి పెరగనుంది.

రెండో విడతకు సంబంధించిన నిధులను దసరా పండుగలోపు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా విద్యార్థుల చదువులకు ఆర్థికంగా చేయూత అందించడమే ప్రభుత్వ ఉద్దేశం.

# డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు ఉండొచ్చు: ఎస్‌బీఐ రీసెర్చ్

రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది.వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే.ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది.చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# రసాయన శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో (asymmetric organic synthesis) నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ (ఖశీఝ్ఘురీఎంఅం) వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది.ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో (mirror-image forms) ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు.మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

# పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది.తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది.అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు

అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది.

ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

# ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం

- మొదటి పేజి తరువాయి

కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

## 'రూ.30కోట్ల ఆస్తులు ప్రకటించకపోతే..
# అవినీతి అనుకోవాలా?'

- మొదటి పేజి తరువాయి

చర్య'గా పరిగణించవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది.

### ఎన్నిక రద్దు చేయొచ్చా?

విజయ్ తన అఫిడవిట్‌లో దాదాపు రూ.600 కోట్ల ఆస్తులను ప్రకటించారని, మరో రూ.30 కోట్ల ఆస్తులు వెల్లడించలేదని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై విచారణ సందర్భంగా న్యాయమూర్తి.. ఒకవేళ ఆస్తుల వివరాలను చార్టర్డ్ అకౌంటెంట్ సిద్ధం చేస్తే, పొరపాటున కొన్ని ఆస్తులు మిగిలిపోతే దాని ఆధారంగా ఎన్నికను రద్దు చేయవచ్చా? అని ప్రశ్నించారు. అలాగే వెల్లడించని ఆస్తుల వివరాల వల్ల పెరంబూర్ ఓటర్ల తీర్పుపై నిజంగా ప్రభావం పడిందా? అనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఈ కేసులో విజయ్ తన ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతున్నారు.

# రణరంగంగా మారిన ఢిల్లీ.. రాహుల్, ప్రియాంక అరెస్ట్..

- మొదటి పేజి తరువాయి

నిరసన ప్రదేశానికి వెళ్లకుండా అడ్డుకున్నారని 'ఇండియా కూటమి ఎంపీలు తెలిపారు. దీంతో రాహుల్ ను పోలీసులు బలవంతంగా వాహనం ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. తమను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని, తమపై దాడి చేశారని ×చీణ×ూ కూటమి ఎంపీలు ఆరోపించారు. మరోవైపు, నిరసనకు అనుమతి తీసుకోలేదని, కేంద్ర ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో నిరసనలు, సమావేశాలపై ఆంక్షలు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు: ఆర్బీఐ గవర్నర్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాఖ్యలు చేశారు.బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, "ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు.గత ఆరేళ్లుగా నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2,000కు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ రుసుము ప్రభుత్వానికి కాకుండా, పేమెంట్ సేవలు అందించే సంస్థలకు చేరుతుందని ఆమె తెలిపారు.ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తుల వంటి రంగాల్లో రూ. 2,000 దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్ ఫీజు ఉంటుంది. రూ. 75,000 అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. అయితే, వ్యక్తుల మధ్య (ూ2ూ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ సేవలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి.

# ఖర్గే విందుకు అఖిలేశ్ డుమ్మా..

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. భవిష్యత్తులో ప్రతిపక్ష నేతల భేటీలు కేవలం భోజనాలకే పరిమితం కావని, టీ తాగుతూ లేదా సమోసాలు తింటూ కూడా చర్చించుకోవచ్చని ఆయన చమత్కరించారు.

జన్‌పథ్‌లోని సాగర్ రత్న హోటల్‌లో ఖర్గే ఏర్పాటు చేసిన విందుకు ఎందుకు హాజరు కాలేదని మీడియా ప్రశ్నించగా అఖిలేశ్ స్పందించారు. "ఇది ఒక్క భోజనంతో ముగిసేది కాదు. భవిష్యత్తులో టీ తాగుతూ సమావేశమయ్యామని కూడా మీరు వినొచ్చు. మేమంతా కలిసి సమోసాలు కూడా తినొచ్చు. చర్చలు కొనసాగుతూనే ఉంటాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.అంతకుముందు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇండియా కూటమి నిర్వహించిన నిరసన ప్రదర్శనలో అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న నేతల్లో ఆయన కూడా ఉన్నారు. అయితే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు ఆకాశవాణి భవన్ వద్ద కొనసాగించిన ధర్నాలో మాత్రం ఆయన పాల్గొనకుండా లక్నోకు తిరిగి వెళ్లారు. బుధవారం నాటి విందుకు, ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన కార్యక్రమానికి కూడా ఆయన, ఇతర ఎస్పీ ఎంపీలు దూరంగా ఉన్నారు.విందు ఆహ్వానం ఆలస్యంగా అందడం వల్లే అఖిలేశ్ హాజరు కాలేదని సమాజ్‌వాదీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం నాటి నిరసన కార్యక్రమాల్లో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయాలపై అసంతృప్తి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. కాంగ్రెస్ నేతలు మాత్రం ఈ విషయాన్ని తేలికగా తీసుకుంటున్నారు. మంగళవారం నాటి ఘటనల తర్వాత చాలామంది ఎస్పీ ఎంపీలు ఢిల్లీ నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. అయితే, 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సమన్వయ లోపం ఉందన్న చర్చకు ఈ పరిణామం మరింత బలాన్నిచ్చింది.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి







**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 18, 19, 20, 21 & 23 డివిజన్లలో 2.50 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ రకాల అభివృద్ధి పనులను శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ లలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బిజెపి, స్థానిక ప్రజలతో కలసి బుధవారం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి.

ఇప్పటికే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , యువనేత నారా లోకేష్ ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 966 కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులని మనం శాంక్షన్ చేయించుకున్నాం. కొన్ని పూర్తయినాయి, కొన్ని జరుగుతున్నాయి, కొన్ని టెండర్ ప్రాసెస్ లో ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. అదేవిధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఏ రోజైతే శంకుస్థాపన చేస్తామో, ఆ రోజే పని కూడా ప్రారంభించి, ఆ పని ఎప్పటిలోగా పూర్తవుతుందో చెప్పడం ఆనవాయితీగా వస్తుంది. అదేవిధంగా ఈరోజు శంకుస్థాపన చేసే పనులన్నీ కూడా ఒక నెలలో పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందిస్తాం. అదేవిధంగా ఈరోజు ప్రత్యేకంగా 19వ డివిజన్ లో ప్రజలందరి చేతుల మీదుగా ఈరోజు మనం శంకుస్థాపన చేసుకున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క 19వ డివిజన్ లోనే వివిధ రకాల అభివృద్ధి పనులకి, సీసీ రోడ్లు గాని, సీసీ డ్రైన్లు గాని, అదేవిధంగా పార్కులు గాని, కరెంటుకుగాని, డ్రింకింగ్ వాటర్ గాని, ఇతరత్రా అభివృద్ధి పనులన్నిటికి 9 కోట్ల రూపాయల కేటాయించడం జరిగింది. ఇంత అభివృద్ధి చేస్తూ, ఇన్ని మంచి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఈ మంచి ప్రభుత్వం,

ఈ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలందరూ కూడా ఆశీర్వదించాలని... అదేవిధంగా రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులైన తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ అభ్యర్థుల్ని ప్రజలందరూకూడానెల్లూరురూరల్నియోజకవర్గంలో ఆశీర్వదిస్తే నెల్లూరు రూరల్ శాసనసభ్యులు శ్రీధర్ రెడ్డి కి గౌరవ ముఖ్యమంత్రి దగ్గర ఇంకా గౌరవం దక్కుతుంది.

స్థానిక ఎలక్షన్లలో, రాబోయే కార్పొరేషన్ ఎలక్షన్లలో అటు కార్పొరేటర్ కి గాని, మేయర్ అభ్యర్థికి గాని కూటమి అభ్యర్థులను గెలిపించినట్లయితే భవిష్యత్తులో ఇంకా ఎక్కువ నిధులు తెచ్చి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎక్కడెక్కడ పనులు చేయాలో అవన్నీ కూడా ఆ డివిజన్ లో ఉన్న స్థానిక ప్రజల సలహా సూచనల మేరకు, కూటమి నాయకుల సలహా సూచనల మేరకు ఈ పనులన్నీ కూడా చేయడం జరుగుతుంది.

తప్పకుండా ఆలోచించి ఒక మంచి నిర్ణయం తీసుకొని కూటమి పార్టీ అభ్యర్థుల్ని గెలిపించాలని ప్రజలందరినీ కూడా నమస్కరిస్తున్నాను.

పై కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి

## – ఎంపీ బీద మస్తాన్ రావు యాదవ్




**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలు అందిస్తున్న PMPs/RMPsకు శిక్షణ, నైపుణ్య పరీక్ష, ధృవీకరణ, పర్యవేక్షణతో కూడిన నియంత్రిత గుర్తింపు కల్పించాలని రాజ్యసభ సభ్యులు శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్ కోరారు.

అఖిల భారత బేసిక్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య మౌలిక వసతుల లోటును దృష్టిలో ఉంచుకుని శిక్షణ పొందిన PMPs/RMPsను ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా చివరి మైలు వరకు సేవలను బలోపేతం చేయవచ్చన్నారు.

అయితే, గుర్తింపు అంటే స్వేచ్ఛాయుత వైద్యచికిత్సకు అనుమతి కాదని, స్పష్టమైన సేవల పరిధి, రోగి భద్రతా ప్రమాణాలు, తప్పనిసరి రిఫరల్ విధానం ఉండాలని స్పష్టం చేశారు. PMPs/RMPs అర్హత కలిగిన వైద్యులకు సహాయకులుగా పనిచేయాలని శ్రీ బీద మస్తాన్ రావు యాదవ్ పేర్కొన్నారు.

# నూతన డీఎస్పీ నరసింహమూర్తికి కాంగ్రెస్ నేతల స్వాగతం




**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,07:**

తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ బాలగూరవం బాబు గారి ఆదేశాల మేరకు గూడూరు డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలుస్వీకరించిన శ్రీ నరసింహమూర్తిని గూడూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ బీమవరపు నరసయ్య మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై డీఎస్పీతో చర్చించారు. ప్రజలకు పోలీసు శాఖ మరింత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ గౌసేబాషా, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పర్వతల శీను గౌడ్, తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎస్కే నాయకుల ఫయాజ్, గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్కే ఇబ్రహీం, గూడూరు పట్టణ మైనారిటీ అధ్యక్షులు ఎస్కే ఖలీల్, గూడూరు పట్టణ వార్డు సభ్యులు ఏ. అంకయ్య, కుడుముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా | తిరుపతి | చిత్తూరు | వై.ఎస్.ఆర్. కడప

# నెల్లూరు నగరంలో 16వ డివిజన్ నాయకులతో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి సమావేశం





**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియకు కసరత్తు మొదలవడంతో.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరుసగా డివిజన్ వారీగా కార్యకర్తల సమావేశాలు. కార్పొరేషన్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కేడర్ కు దిశా నిర్దేశం

నెల్లూరు వైఎస్ఆర్‌సీపీ సిటీ కార్యాలయానికి 16వ డివిజన్ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. 16వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. ప్రజా సమస్యలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటాల్లో చురుగ్గా పాల్గొంటున్న కార్యకర్తలను ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. పార్టీ చేస్తున్న పోరాటాలను మరింత విస్తృతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంతమంది ఆశావహులు ఉన్నప్పటికీ.. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపు జరుగుతుందని చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. అభ్యర్థి ఎవరైనా.. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ అభ్యర్థుల విజయానికి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# నెల్లూరు మేయర్ అభ్యర్థిగా వైసీపీ రూరల్ ఇన్చార్జ్ గా ఉన్న ఆనం విజయకుమార్ రెడ్డి

**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

కొద్దిసేపటి క్రితం తాడేపల్లిలో ప్రకటించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఇన్చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి భేటీ.కార్పొరేషన్ ఈ సారి ఓసీ జనరల్ అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో. విజయకుమార్ రెడ్డి పేరును ఖరారు చేసునట్లు మాజీ మంత్రి కాకాణి తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో వెల్లడి.

కాగా కూటమి ప్రభుత్వం తమ మేయర్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.



# కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో వైఎస్ఆర్సిపి నెల్లూరు నగర నియోజకవర్గం.

- 51వ డివిజన్ కార్యకర్తలతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమావేశం.
- డివిజన్లో అందరినీ కలుపుకుపోయి పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పిలుపు







**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు వైసిపి సిటీ ఆఫీస్ లో 51వ డివిజన్ నాయకులు,కార్యకర్తలతో.. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమావేశమయ్యారు.ఈ సందర్భంగా డివిజన్ లో పార్టీ.. సమస్యలపై.. కార్యకర్తలతో చంద్రశేఖర్ రెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ.. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాల్లో కార్యకర్తలందరూ.. భాగస్వామ్యం అయ్యేలా చూడాలని కోరారు. జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో.. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోసం శ్రమించిన వారికి టికెట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

డివిజన్ లో ఎవరికి టికెట్ ఇచ్చిన అది అధిష్టానం నిర్ణయం మేరకు జరుగుతుందని.. పార్టీ నిర్ణయాన్ని శిరసా వహించి ప్రతి ఒక్కరు డివిజన్లో అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.

# అంతరిక్షంపై ఆసక్తి పెంచుకోవాలి

## -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా






**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబరు 7**

విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి పెంచుకొని, ప్రయోగాత్మక అభ్యసనం, పరిశోధనా దృక్పథంతో భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల లోని ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇస్రో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఆమె ప్రారంభించారు.

ఇస్రో ఎంపిక చేసిన దక్షిణ భారతదేశంలోని ఆరు కార్యక్రమ వేదికల్లో నంద్యాలకు చోటు దక్కడం గర్వకారణమన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా ప్రయోగాలు, పరిశీలన, అన్వేషణ ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అంతరిక్ష సాంకేతికతతో వాతావరణ అంచనాలు, తుఫాన్లు, వరదలపై ముందస్తు హెచ్చరికలతో పాటు వ్యవసాయంలో నేలతేమ, పంటల పరిస్థితిని తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పెద్ద కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో షార్ ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శంకరన్, సీనియర్ శాస్త్రవేత్త టి. శ్రీనివాసరెడ్డి, శాస్త్రవేత్త ఆదిత్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు.

# రూ.69.30 లక్షలతో అత్యాధునిక సైన్స్ ల్యాబ్ ప్రారంభం







**- విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి**

**ఏర్పేడు, పెన్ పవర్, అక్టోబర్ 07:**

విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ప్లస్)లో రూ.69.30 లక్షల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల్లో ఆధునిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తూ విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని అన్నారు.

శాస్త్రీయ దృక్పథమే భవిష్యత్తుకు పునాది

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా బయాలజీ, కెమిస్ట్రీ ల్యాబ్‌లను అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, సీవీ రామన్ వంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

అదేవిధంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రవేశపెట్టిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' ద్వారా యువతలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను, విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందించి విద్యార్థుల కెరీర్‌కు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి హామీ

పాఠశాల పర్యటనలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడి పాఠశాలలోని మౌలిక వసతులపై ఆరా తీశారు. బాత్రూమ్‌ల అభివృద్ధి, క్రీడా సామగ్రి, అసెంబ్లీ హాల్, డైనింగ్ హాల్ తదితర అవసరాలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

విద్యార్థులు కోరిన సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు ఆహ్లాదకరమైన, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

ఢిల్లీ పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం ఢిల్లీ విమానాశ్రయంలో సాదరంగా స్వాగతం పలికారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని తాజ్ మహల్ హోటల్‌లో నిర్వహించనున్న '31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 కర్టెన్ రైజర్' (31st CII Partnership Summit 2026 Curtain Raiser) కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీకి చేరుకున్నారు. అక్టోబరు 8న గురువారం ఉదయం 11:45 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ తో కలిసి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకోనున్నారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు

# బాధిత కుటుంబానికి భరోసాగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,07:**

చిల్లకూరు మండలం ఉడతావారిపాలెం గ్రామానికి చెందిన రెకందర్ భాస్కర్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం కిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆయన దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం రూ.1,76,192 విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను మంజూరు చేసింది. మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ భాస్కర్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైద్య సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.



# జనసేనలోకి శెట్టిపల్లి సురేష్‌కు ఆహ్వానం

## త్వరలో పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు ప్రకటన





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07:**
జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా నియోజకవర్గంలో ఆత్మీయ భేటీలకు శ్రీకారం చుట్టిన పార్టీ నాయకులు, శ్రీకాళహస్తి పట్టణ ప్రముఖుడు, పారిశ్రామికవేత్త, మాజీ శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ చైర్మన్ శెట్టిపల్లి సురేష్ను జనసేన పార్టీలోకి ఆహ్వానించారు.
అమరావతితాడేపల్లిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన అనంతరం నియోజకవర్గంలోని ప్రముఖులను కలుస్తున్న జనసేన నాయకులు మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్ శెట్టిపల్లి సురేష్‌ను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా శెట్టిపల్లి సురేష్ మాట్లాడుతూ, త్వరలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. అనంతరం మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్‌లను కూడా శెట్టిపల్లి సురేష్ సన్మానించారు.
ఈ ఆత్మీయ సమావేశంలో మాజీ కౌన్సిలర్ జయదేవన్ గిరి, పోలస్వామి వేణు, మునిశేఖర్, పోలి గణేష్, లీలా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గాంబ అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలకు ఘన ఏర్పాట్లు

**అక్టోబర్ 11 నుంచి 20 వరకు వైభవంగా ఉత్సవాలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ కనకాచలంపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గాంబ అమ్మవారి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు-2026ను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాల ప్రచార పోస్టర్‌ను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి ఛైర్మన్, పాలకమండలి సభ్యులు, కూటమి నాయకులు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగానే పూర్తి చేయాలని ఆలయ అధికారులకు సూచించారు.ప్రత్యేకించి కనకాచలంపైకి మెట్ల మార్గం ద్వారా వెళ్లే వృద్ధులు, మహిళలు, చిన్నారులు, ఇతర భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తాగునీరు, వైద్య సేవలు, భద్రత, క్యూలైన్లు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రత్యేక వాలంటీర్లను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాల ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.
శరన్నవరాత్రి మహోత్సవాల్లో భక్తులందరూ విశేషంగా పాల్గొని శ్రీ కనకదుర్గాంబ అమ్మవారి కృపాకటాక్షాలను పొందాలని ఆకాంక్షించారు. జగన్మాత దివ్య ఆశీస్సులు శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో భారీ జాబ్ మేళా




**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07**
పట్టణంలో మొదటి సారి జనసేన పార్టీ కార్యాలయంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుంది. బ్లూ స్టార్ (బ్లూ స్టార్) ఏసీ కంపెనీ ఆధ్వర్యంలో భారీ ఉద్యోగ నియామక జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన నాయకులు తెలిపారు . ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థాన చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ప్రసాద్ గారు మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం జాబ్ మేళా ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు ఇది మంచి అవకాశమని, శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రజలకు ఎప్పుడు జనసేన పార్టీ అందుబాటులో ఉంటుందని ప్రజల కష్టాలను సమస్యలను ఎప్పుడూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో తాము ముందుంటామని మాట్లాడడం జరిగింది.
జాబ్ మేళా తేదీ: 09-10-2026 (శుక్రవారం)
సమయం: ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు
వేదిక: శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం, సీతాలాంబ దేవాలయం ఎదురుగా, శ్రీకాళహస్తి.
సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:
9840332850 । 6301102807 । 9491774088 । 9059046057 । 9381711439 । 9701598120

# ప్రజాసేవే లక్ష్యంగా సేవా సంకల్ప్ అభియాన్

## బుచ్చి రూరల్ మండలంలో పలు సేవా





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 7.**
భారత ప్రధాన మంత్రి మాన్య నరేంద్ర మోదీ 25ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా ఈరోజు బి.జె.పి బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండల అధ్యక్షుడు సిద్ధన.మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చెల్లాయపాళెం పంచాయితీలో పలు సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది.వాటిలో మొదటగా బి.జె.పి దళిత మోర్చా రూరల్ మండల అధ్యక్షుడు కట్టా.ఏడుకొండలు తో కలసి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి అనంతరం వారి విగ్రహానికి పూలమాల వేయడం జరిగింది.తదుపరి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నెల్లూరు.సుబ్రహ్మణ్యం తో కలిసి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అక్కడ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహార సరఫరా వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది.అనంతరం అక్కడ పిల్లలకు పలకలు,తినుబండారాలు పంపిణీ చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో బి.జె.పి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి.రఘురామయ్య,బి.జె.పి ఓబిసి మోర్చా తిరుపతి జిల్లా ఇన్ చార్జ్ గంజం.పెంచల ప్రసాద్,బి.జె.పి మండల ప్రధాన కార్యదర్శులు పెజ్జాయి.క్రిష్ణారెడ్డి,అల్లం.మస్తానయ్య,మండల ఉపాధ్యక్షులు మోడెం.నిరంజన్ రెడ్డి,ఓబిసి మోర్చా మండల ఉపాధ్యక్షుడు జిల్లెల్ల.సంజీవయ్య,మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు సయ్యద్.చాన్ భాషా,గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు రాగి.ప్రసాద్,మైనార్టీ నాయకులు షేక్.గౌస్ బాషా,దళిత మోర్చా నాయకులు కోవూరు.రవి మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కార్యకర్త సంక్షేమమే టీడీపీకి తొలి ప్రాధాన్యత

**- స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలి**
**- బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం టీడీపీ పోరాటం: డా.యం.ఉమేష్‌రావు**




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 07:**
తన మాన, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే సాధారణ కార్యకర్త సంక్షేమమే తెలుగుదేశం పార్టీకి తొలి ప్రాధాన్యత కావాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు అన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, నాయకత్వం అప్పగించిన ప్రతి బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తించే కార్యకర్తలే టీడీపీకి నిజమైన బలమని పేర్కొన్నారు.

**నిబద్ధతకు నిలువుటద్దం టీడీపీ కార్యకర్త**

స్వర్గీయ నందమూరి తారక రామారావు సమున్నత ఆశయాలతో స్థాపించిన తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని ఉమేష్‌రావు అన్నారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను 'జై తెలుగుదేశం... జై జై తెలుగుదేశం' అంటూ నిబద్ధతతో పూర్తి చేసి ప్రజాభిమానాన్ని చూరగొనే కార్యకర్తల సేవలు అభినందనీయమన్నారు.
టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని 50, 51, 52, 53 బూత్‌ల పరిధిలోని పార్టీ కార్యకర్తల సమావేశాన్ని 18వ వార్డు టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమస్యలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం**

గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ద్వారా క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతాయని ఉమేష్‌రావు తెలిపారు.
స్థానిక సంస్థలకు ఎన్నికైన పాలకవర్గాలు లేకపోతే కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు, గ్రాంట్లపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.
ఆంధ్రప్రదేశ్‌కు 16వ ఆర్థిక సంఘం ద్వారా సుమారు రూ.12 వేల కోట్ల నిధులు రావాల్సి ఉందని, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ-ఎన్డీయే కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం**

బీసీల రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఉమేష్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు.
బీసీ నాయకత్వం బలోపేతం కాకుండా అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు టీడీపీ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు.

**కలిసికట్టుగా పనిచేద్దాం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి,పట్టణ ధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు కంటా రమేష్, లక్కమనేని మధుబాబు, గాదిపాకుల గోపీనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, మాజీ సహకార బ్యాంకు ఛైర్మన్ డి.వి.నారాయణ, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తిరుపతి పార్లమెంటు నాయకులు సయ్యద్ చాంద్ బాషా, గాజుల భగత్ రాయల్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాచగున్నేరిలో వర్మీ కంపోస్ట్‌పై శిక్షణ




**- ప్రతి గ్రామంలో నెలకు కనీసం టన్ను వర్మీ కంపోస్ట్ తయారీ లక్ష్యం**
**- తడి, పొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేయాలి ఎంపీడీవో పెంచల శ్యామ్**




**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దే దిశగా వర్మీ కంపోస్ట్ తయారీపై పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులకు ఒకరోజుక్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాచగున్నేరి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూపీసీ (ఎస్ డబ్ల్యు పి సి) షెడ్డులో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. పెంచల శ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప మండల అభివృద్ధి అధికారి కె. పద్మజ, రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు, పంచాయతీ అభివృద్ధి అధికారి జి. వెంకట శివతో పాటు మండలంలోని 46 గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వర్మీ కంపోస్ట్ తయారీ విధానం, బిన్‌బ్యాగ్ విధానం అమలు, తడిపొడి చెత్తను ఇంటి వద్దే వేరు చేసే పద్ధతులపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. తడి చెత్తను సక్రమంగా వినియోగించి ప్రతి గ్రామపంచాయతీ నెలకు కనీసం ఒక టన్ను వర్మీ కంపోస్ట్ తయారు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.
ప్రజల్లో చెత్త వేరు చేయడంపై విస్తృత అవగాహన కల్పించి, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎంపీడీవో పెంచల శ్యామ్, డిప్యూటీ ఎంపీడీవో పద్మజ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బిన్‌బ్యాగ్ విధానాన్ని సమర్థంగా అమలు చేసి తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా మార్చడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.
రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు మాట్లాడుతూ.. రాచగున్నేరి ఎస్‌డబ్ల్యూపీసీని మరింత సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిపేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి జనసేనలో దుమ్ము రాయల్‌కు కీలక బాధ్యత?

**- పార్టీ బలోపేతం.. నాయకులు, కార్యకర్తల సమన్వయంపై అధిష్ఠానం దృష్టి**
**- వివిధ వర్గాలతో సత్సంబంధాలు కలిసొచ్చే అవకాశం.. రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07:**
జనసేన పార్టీని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లే అంశాలపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కుప్పాల వెంకటేష్ (దుమ్ము రాయల్)కు పార్టీలో కీలక బాధ్యత అప్పగించే అంశం తెరపైకి వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.
స్థానికంగా బలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా దుమ్ము రాయల్‌కు మంచి పరిచయాలు ఉన్నాయని ఆయన అనుచర వర్గాలు పేర్కొంటున్నాయి. బలిజ పెద్దలతో పాటు వివిధ సామాజిక వర్గాల ప్రముఖులతో సత్సంబంధాలు కొనసాగించడం, అందరితో మర్యాదగా, గౌరవంగా వ్యవహరించడం ఆయనకు కలిసొచ్చే అంశాలుగా కొందరు పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.కూటమికి చెందిన ముఖ్య నాయకులతో కలిసి పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న నేపథ్యంలో ఆయన సేవలను పార్టీ పరంగా మరింత విస్తృతంగా వినియోగించుకోవాలనే ఆలోచన కొందరు నాయకుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వివిధ గ్రూపులు, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధించడంలో ఆయనకు ఉన్న పరిచయాలు, అనుభవం పార్టీకి ఉపయోగపడతాయని నాయకులు భావిస్తున్నట్లు సమాచారం.

**పాత పరిచయాలు.. కొత్త బాధ్యతకు బలం?**

గతంలో మాజీ ఇంచార్జీతో కలిసి పనిచేసిన అనుభవం, ఆమె నుంచి లభించిన సహాయ సహకారాలు కూడా దుమ్ము రాయల్‌కు అదనపు బలంగా మారే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్‌తో పాటు పలువురు సభ్యులతో ఆయనకు ఉన్న స్నేహపూర్వక సంబంధాలు కూడా పార్టీ కార్యక్రమాల సమన్వయంలో కలిసి వచ్చే అంశంగా కొందరు పేర్కొంటున్నారు.
ప్రజా సమస్యలపై స్పందించడం, స్థానికంగా అందుబాటులో ఉండడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారుతున్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీంతో జనసేనలో ఆయనకు ఎలాంటి కీలక బాధ్యత దక్కుతుందన్న అంశం ప్రస్తుతం నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**పార్టీ నిర్ణయమే నా నిర్ణయం**

దుమ్ము రాయల్‌ను ఈ విషయంపై ప్రశ్నించగా.. "పార్టీ నిర్ణయమే నా నిర్ణయం. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తాను. పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తాను" అని పేర్కొన్నట్లు సమాచారం.
అయితే దుమ్ము రాయల్‌కు ఎలాంటి బాధ్యత అప్పగించాలన్నది పూర్తిగా పార్టీ అధిష్ఠానం నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఆయన పేరు చుట్టూ జరుగుతున్న చర్చకు అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉండగా, కీలక పదవి దక్కుతుందా? అన్న అంశం శ్రీకాళహస్తి జనసేన శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

## శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు





**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07:**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, తెలంగాణ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు గౌరవపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా ఇరువురు స్నేహపూర్వక వాతావరణంలో పలు అంశాలపై చర్చించుకున్నారు. విద్యార్థులు, యువతకు సంబంధించిన అంశాలతో పాటు సమకాలీన పరిస్థితులపై కూడా అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు.
అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ శ్రీకాళహస్తికి విచ్చేసి జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అధికారులు, సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా శ్రీకాళహస్తి క్షేత్ర విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఆయనకు వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ పరిసరాలను సందర్శించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

# ఎమ్మెల్యే బొజ్జల ఆశీస్సులతో గోకులం షెడ్లకు భూమిపూజ

## పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట గాలి మురళి నాయుడు





**తొట్టంబేడు. పెన్ పవర్, అక్టోబర్ 07:**
పాడి రైతులను ప్రోత్సహించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు.
శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం కొనతనేరి గ్రామపంచాయతీ పరిధిలోని కొనతనేరి గ్రామంలో ఆరు ఆవుల సామర్థ్యం కలిగిన షెడ్డు నిర్మాణానికి రూ. 2 లక్షలు మంజూరు కాగా, గుర్రప్ప నాయుడు కండ్రిగ హరిజనవాడలో నాలుగు ఆవుల షెడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 1.85 లక్షలు మంజూరయ్యాయి.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు ఆయా షెడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..
గోకులం షెడ్ల నిర్మాణంతో పాడి రైతులకు పశువుల సంరక్షణలో మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. మంజూరైన నిధులతో పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు, లబ్ధిదారులను కోరారు. షెడ్ల నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని గాలి మురళి నాయుడు తెలిపారు.
గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు.

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 7**
సమాజంలో ప్రతి రోజు ఏదో ఒక ఎత్తుగడతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకూడదని విద్యార్థినులకు మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయరాం పేర్కొన్నారు.
నంద్యాల గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ లో అక్కడ డిప్లమా చదువుతున్న అమ్మాయిలకు మహిళా చట్టాలపై మరియు శక్తి ఆకులపై అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగినది ఈ ప్రోగ్రామునకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాం మరియు పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ , అధ్యాపకులు విద్యా శ్రీ మరియు మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగినది మహిళా పోలీస్ స్టేషన్ సిఐ మాట్లాడుతూ ప్రతిరోజు ఏదో ఒక కొత్త ఎత్తుగడలతో సైబర్ నెరగాళు రెచ్చిపోవడం జరుగుతున్నది ఏదైనా మీ ఫోన్ లకు ఈ కేవైసీలు వచ్చిన ఫోన్లో బెదిరింపు కాలు వచ్చిన మరియు మీకు సంబంధించిన ఏదైనా మీ షో ఫ్లిప్కార్ట్ అమెజాన్ పార్సెల్ వచ్చిన మీకు తెలియకుండా జాగ్రత్తగా ఉండాలని తీసుకోకపోవడమే మంచిదని అన్నారు. ఈ కేవైసీలు ఓపెన్ చేయకపోవడం మంచిదని ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు సైబర్ ఫోన్ నెంబర్ 1930 ను ఉపయోగించుకొని రక్షణ పొందగలరని కోరారు. ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు లేదా పోకిరిల వల్ల ఏదైనా సమస్య వస్తుందని తెలిసినప్పుడు ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు లేదా నీకు తెలిసిన లేక మీ ఉంటున్న పరిసరాల్లో చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేస్తున్న లేదా ర్యాగింగ్ జరిగిన మత్తు పదార్థాలు అమ్ముతున్నారని తెలిసినప్పుడు 112 పోలీస్ నెంబర్ కు ఫిర్యాదు చెయ్యగలరని కోరారు. దూర ప్రదేశాలకు ఏదైనా పోటీ పరీక్షలు రాయడానికి వెళ్లినప్పుడు అక్కడ ఎవ్వరు బంధువులు లేనప్పుడు వన్ స్టాప్ సెంటర్ లను ఉపయోగించు కోవాలని అక్కడ ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ మహిళలకు ఉచిత వసతి కల్పిస్తున్నది అని అవర్ నెస్ ప్రోగ్రామ్ బాలికలకు తెలపడం జరిగినది.



# భక్తులపై దళారీ దందాకు అడ్డుకట్ట ఎప్పుడు?

- **శ్రీకాళహస్తి ఆలయ ద్వారాల వద్ద అక్రమ వసూళ్లపై భక్తుల ఆందోళన**
- **ఈఓ, చైర్మన్ తక్షణమే స్పందించాలని భక్తుల విజ్ఞప్తి**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07:**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ఆలయానికి వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.
అయితే ఆలయ పరిసరాల్లోని రెండో, మూడో, నాలుగో గేట్ల వద్ద కొందరు వ్యక్తులు భక్తులను వివిధ రకాలుగా సంప్రదిస్తూ వీఐపీ దర్శనాలు, దక్షిణాల పేరుతో మధ్యవర్తిత్వం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకంగా 'సందేశ్ సాహో'కు సంబంధించిన వ్యక్తులు భక్తులతోసంప్రదింపులు జరుపుతున్నారనే ఆరోపణల పై ఆలయ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.
ఈ అంశంపై గతంలోనూ పలు కథనాలు



వెలువడినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
సీసీ కెమెరాలు ఉన్నా పర్యవేక్షణ ఏది?
ఆలయ ప్రధాన ద్వారాలు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీఇలాంటికార్యకలాపాలుజరుగుతున్నాయంటే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని భక్తులు అంటున్నారు. రోజంతా ఎన్ని వాహనాలు వస్తున్నాయి? ఎవరెవరు భక్తులతో మాట్లాడుతున్నారు? ఎంతమందిని వీఐపీ దర్శనాల పేరుతో లోపలికి తీసుకెళ్తున్నారు? వంటి అంశాలను సీసీ కెమెరాల ద్వారా అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు.
"మన ఊరు.. మన గుడి.. మనం కాపాడుకోలేమా? దళారీ వ్యవస్థకు ఆలయం వేదిక కావాలా?" అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.
అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి
ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరైనా భక్తులను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ ఈఓ, చైర్మన్ ప్రత్యేక దృష్టి సారించి గేట్ల వద్ద భద్రతా సిబ్బంది, ఆలయ సిబ్బంది పర్యవేక్షణను పెంచడంతో పాటు సీసీ కెమెరాల పనితీరును సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేశం నలుమూలల నుంచి భక్తులు విశ్వాసంతో శ్రీకాళహస్తికి వస్తున్నారని, వారి విశ్వాసాన్ని దళారీ వ్యవస్థ దెబ్బతీయకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

## పోలింగ్ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు.. సౌకర్యాలు, భద్రతపై అధికారుల ప్రత్యేక దృష్టి

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 07**
ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు నంద్యాల పట్టణంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, అదనపు ఎస్పీ ఆర్. సుస్మిత బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలను సమగ్రంగా తనిఖీ చేశారు.
ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేయాలని అధికారులు సూచించారు. ఓటర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా



తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని మౌలిక వసతులను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, రహదారి సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా ముందస్తుగానే గుర్తించి పరిష్కరించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలోఎన్నికల నిర్వహణే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్ కుమార్, రసూల్ ఆజాద్, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, రెజ్వాన్, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్ట.

# నంద్యాలలో బీజేపీ సేవా జ్యోతి ర్యాలీ

- **నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవపై జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు నేతృత్వంలో కార్యక్రమాలు**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 07**
నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా నంద్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి మోదీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నాయకులు, కార్యకర్తలకు వివరించారు.
అనంతరం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి సేవా జ్యోతిని వెలిగించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
బీజేపీలోకి భారీగా చేరికలు–ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చ–
రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని



మున్సిపాలిటీల వారీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు నాయకులతో చర్చించారు. పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై కార్యవర్గ సభ్యులతో సమీక్షించారు.

# మీసేవ నిలిపివేసిన సేవలను వెంటనే పునరుద్ధరించాలి



- **ప్రజలకు ఇబ్బందులు.. నిర్వాహకులకు ఉపాధి నష్టం**
- **ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం వినతి**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 07:**
మీసేవ, ఏపీ సేవ పోర్టళ్లలో నిలిపివేసిన వివిధ సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.
కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ, పట్టాదార్ పాస్‌బుక్ రీప్రింట్, వాటర్ టాక్స్, సీడీఎంఏ (జనన, మరణ ధ్రువీకరణ) తదితర సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు, ఆన్‌లైన్ సేవలపై అవగాహన లేని సామాన్య ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించే క్రమంలో సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. రీ-ఇష్యూ సేవలు నిలిపివేయడంతో ఆదాయానికి గండి
మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుతున్న రీ-ఇష్యూ వంటి సేవలు నిలిచిపోవడంతో తమ ప్రధాన ఆదాయ వనరులు దెబ్బతిన్నాయని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో వేలాది మీసేవ నిర్వాహక కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా, సురక్షితంగా ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు మీసేవ నిర్వాహకుల ఉపాధిని కాపాడేందుకు 'మన మిత్ర'తో పాటు మీసేవ, ఏపీ సేవ పోర్టళ్లలో నిలిపివేసిన అన్ని సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన ఆదేశాలు జారీ చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనలో పత్తి పంట

## సాగు విశిష్టమైన పాత్ర పోషిస్తుంది

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 7**
పేదరిక నిర్మూలనలో పత్తి పంటసాగు విశిష్టమైన పాత్ర పోషిస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ వి. విజయలక్ష్మి పేర్కొన్నారు.
ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగాప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాలలో అక్టోబర్ ఏడవ తేదీన ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ వి. జయలక్ష్మి మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రత్తి పంటను సాగుచేసే రైతులు ఎదుర్కొంటున్న టువంటి సమస్యలు,వాటిని అధిగమించుటకు పాటించవలసినటువంటి విధానాలను తెలియపరిచారు. పేదరిక నిర్మూలనలో ప్రత్తి పంట సాగు విశిష్టమైనటువంటి పాత్ర పోషిస్తుందని తెలిపారు. దేశీయంగా స్థిరమైన ఆర్థిక అభివృద్ధికి తన వంతు తోడ్పాటున అందిస్తున్న ప్రత్తి పంట సాగు నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న పరిస్థితులలో శాస్త్రవేత్తలు మరియు రైతులు కీలకపాత్ర పోషించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల నుండి విడుదలై మన ప్రాంతానికి అనువైన రకాలను మరియు వాటి ప్రాధాన్యత




గురించి వివరించారు. ప్రత్తి పంట లాభసాటిగా మారాలంటే తెగుళ్లు మరియు చీడపీడల నివారణకు నూతన విధానాలను పాటించాలని మరియు దేశీయంగా అధిక సాంద్రత విధానాలలో ప్రత్తి పంట సాగును ప్రోత్సహించడం మరియు యంత్రాల ద్వారా పత్తి తీయగలిగే వంగడాలను అందుబాటులోకి తీసుకురావడం ముఖ్యమని అన్నారు.
ఈ కార్యక్రమములో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మరియు పాలిటెక్నిక్ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను బీసీ ఇందిరా రెడ్డి విడుదల చేశారు.



**బనగానపల్లె పెన్ పవర్ అక్టోబర్ 07**
దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీమత్ కన్యకాపరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు బనగానపల్లె పట్టణంలోని మంగళవారం పేట శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి 21వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బనగానపల్లె ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను బీసీ ఇందిరా రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# టిడ్కో గృహాలపై ప్రత్యేక దృష్టిలిటిడ్కో చైర్మన్

## అజయ్‌కుమార్ పరిశీలన

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 7**
నంద్యాల పట్టణంలోని ఎస్‌ఆర్‌బీసీ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహాలను టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. గృహాల పరిస్థితి, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులు, పెండింగ్ పనులపై అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.
టిడ్కో గృహ సముదాయంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు తదితర అంశాలను పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి, గృహ సముదాయాన్ని ప్రజలకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్‌కుమార్, రసూల్ ఆజాద్,



టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

## -జాప్యం లేకుండా పరిష్కరించాలి : కలెక్టర్




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబరు 07**
రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా క్షేత్రస్థాయిలోనే సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. బుధవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు.
22ఏ, ఇనాం పట్టాలు, మ్యుటేషన్లు, సర్వే సర్టిఫికెట్ల దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్యపై పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టి, అవసరమైన ఫైళ్లను వెంటనే పైస్థాయికి పంపాలని ఆదేశించారు.
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కుల, నో డ్యూస్ ధ్రువీకరణ పత్రాలను నిబంధనల మేరకు సత్వరం జారీ చేయాలని సూచించారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులపై దరఖాస్తుదారులతో స్వయంగా మాట్లాడి సమస్య పరిష్కార స్థితిని తెలుసుకోవడంతో పాటు ప్రజల సంతృప్తిని నిర్ధారించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్వో రామునాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం





- క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం
అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తి పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల (పబ్లిక్ గ్రీవన్స్ ) కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామాజిక, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ స్పందనతో చర్యలు చేపట్టి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపేందుకు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లుతెలిపారు.ప్రజలకుఎల్లప్పుడూఅందుబాటు లో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# 57వ బూత్‌లో టీడీపీ సమావేశం.. మున్సిపల్ ఎన్నికలపై కసరత్తు

## వార్డు సమస్యల పరిష్కారంతో పాటు ఎన్నికల వ్యూహాలపై నాయకుల చర్చ



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 07:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సూచనలు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహించే మొదటి బుధవారం సమావేశాన్ని శ్రీకాళహస్తి పట్టణంలోని 57వ బూత్‌లో నిర్వహించారు.
ఈ సందర్భంగా వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చ జరిగింది.
బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గాదిపక్కల గోపీనాథ్, యూనిట్ ఇన్‌చార్జ్ వినయ్ కుమార్, కో-కన్వీనర్ వజ్రం కిషోర్, బూత్ ఇన్‌చార్జిలు సాజిద్ భాష, ప్రతాపరెడ్డి, బాలాజీ, చందు, రషీద్ భాయ్, హరి తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ రెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 07**
నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి.సుధాకర్ రెడ్డి సార్ పుట్టినరోజు సందర్భంగా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు జి.సుధాకర్ రెడ్డి సార్ కార్యాలయంలో మెగా 9 టీవీ జర్నలిస్టులు జాషువా యలనాటి, పెన్ పవర్ జర్నలిస్ట్ మూసుకు రాజు, మర్యాదపూర్వకంగా కలసి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది.



# శరన్నవరాత్రి గోడపత్రికల ఆవిష్కరణ

## శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానం,జన్నవాడ క్షేత్రం,





**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 7.**
కోవూరు ఎమ్మెల్యే కార్యాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణతేదీ 11-10-2026 నుండి తేదీ 20-10-2026 వరకు జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను మరియు భక్తులకు మరింత సులభంగా ఆలయ సేవలు, దర్శనం, ప్రసాదం, విరాళములు సమర్పించుట మొదలగు వాటిని బుక్ చేసుకునేందుకు రూపొందించిన “మన మిత్ర“ వాట్సప్ క్యూఆర్ ( క్యూఆర్ ) కోడ్ కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరులోని వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు నక్కల శివ కృష్ణ జొన్నలగడ్డ వరలక్ష్మి ముంగర సుధాకర్ ఎమ్మెల్యే కలిసి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు విచ్చేయాల్సిందిగా సాదరంగా ఆహ్వానించారు. ముందుగా ఎమ్మెల్యే అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ఎమ్మెల్యే వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెల్లూరు మేయర్ అభ్యర్థిగా వైసీపీ రూరల్ ఇన్చార్జ్ గా ఉన్న ఆనం విజయకుమార్ రెడ్డి





**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**
కొద్దిసేపటి క్రితం తాడేపల్లిలో ప్రకటించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి.
తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ ఇన్చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి భేటీ.
కార్పొరేషన్ ఈ సారి ఓసీ జనరల్ అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో. విజయకుమార్ రెడ్డి పేరును ఖరారు చేసునట్లు మాజీ మంత్రి కాకాణి తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో వెల్లడి.కాగా కూటమి ప్రభుత్వం తమ మేయర్ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

# మేర్లకపాక టోల్‌గేట్ వద్ద ‘జామ్ జామ్ హోటల్’ ఘన ప్రారంభం







- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి..
- ప్రయాణికులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆకాంక్ష

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 07:**
శ్రీకాళహస్తితిరుపతి జాతీయ రహదారిపై మేర్లకపాక టోల్‌గేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘జామ్ జామ్ హోటల్’ శుభారంభ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను అధికారికంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకాళహస్తితిరుపతి మార్గంలో నిత్యం ప్రయాణించే భక్తులు, పర్యాటకులు, ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో అందించి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.
ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సేవలు అందిస్తే హోటల్ మరింత అభివృద్ధి చెందుతుందని సూచించారు.
కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై హోటల్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.
నూతనంగా ప్రారంభమైన హోటల్ విజయవంతంగా కొనసాగాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందాలని వారు ఆకాంక్షించారు.
మేర్లకపాక టోల్‌గేట్ వద్ద ప్రధాన రహదారికి ఆనుకుని హోటల్ ఏర్పాటు కావడంతో శ్రీకాళహస్తితిరుపతి మార్గంలో ప్రయాణించే వారికి ఆహార సదుపాయం మరింత సులభతరం కానుందని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమం సందడిగా సాగింది.

# 20 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిపై హక్కులు కల్పించాలి

- చిందేపల్లి దళిత రైతుల ఆవేదన.. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని వేడుకోలు

**ఏర్పేడు,పెన్ పవర్, అక్టోబర్ 07:**
2006 నుంచి సాగు చేసుకుంటున్న భూమే మా జీవనాధారం.. అధికారులు చూపించిన భూమిని నమ్ముకుని ఏళ్ల తరబడి సాగు చేస్తున్నా, ఇప్పుడు బయటి వ్యక్తులు వచ్చి తమ భూమిగా పేర్కొంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తమకు న్యాయం చేయాలి” అంటూ చిందేపల్లి గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
రైతుల వివరాల మేరకు.. 2006లో అప్పటి ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేపట్టిన సమయంలో చిందేపల్లి గ్రామంలో మూడు దఫాలుగా భూ పంపిణీ జరిగిందని తెలిపారు. నాలుగో విడతలో 15 మంది రైతులకు భూములు కేటాయించేందుకు అప్పటి రెవెన్యూ అధికారులు జాబితా సిద్ధం చేసినప్పటికీ, ఆ ప్రక్రియ పూర్తికాలేదన్నారు. అనంతరం అధికారులు సుమారు 20 ఎకరాల భూమిని చూపించి, సర్వే నంబర్లు 336, 337, 338, 339లో ఖాళీగా ఉన్న భూమిని సాగు చేసుకోవాలని సూచించారని రైతులు పేర్కొన్నారు.
అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20 ఏళ్లుగా



భూమికి గట్లు ఏర్పాటు చేసుకుని వరి, సజ్జలు, రాగులు తదితర పంటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే 2015లో తమ సాగులో ఉన్న భూములను కొందరు ఇతర వ్యక్తుల పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిసిందని ఆరోపించారు. ఒకే భూమిని వివిధ వ్యక్తుల పేర్లపై విభజించి నమోదు చేయడం తమకు తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు.
తమకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లపై నమోదైన వివరాలను రద్దు చేయాలని 2019 నుంచి పలుమార్లు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినట్లు రైతులు తెలిపారు. అప్పటి ఆర్డీవో కనక నరసారెడ్డికి కూడా వినతిపత్రాలు అందజేశామని చెప్పారు. ఈ వ్యవహారంలో భూమిని బ్లాక్‌లిస్టులో ఉంచి హోల్డ్‌లో పెట్టినట్లు అధికారులు తెలిపారని రైతులు పేర్కొన్నారు.
ఇదే అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, వ్యవహారాన్ని పరిశీలించి తేల్చాలని స్థానిక తహసీల్దార్‌కు అప్పగించినట్లు రైతులు తెలిపారు. ఇటీవల రైతులంతా తహసీల్దార్‌ను కలిసి తమ సమస్యను వివరించగా, సాగు చేసుకోవచ్చని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.
అయితే తాజాగా కొందరు వ్యక్తులు పోలీసుల సమక్షంలో వచ్చి తమను సాగు చేయకుండా అడ్డుకుంటూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆరోపించారు. తాము పేద దళిత రైతులమని, తమకు ఇతర భూములు ఏమీ లేవని, ఈ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నామని కన్నీటి పర్యంతమయ్యారు.
తమ సమస్యపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి స్పందించి, రెవెన్యూ రికార్డులను పరిశీలించి, 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చిందేపల్లి దళిత రైతులు విజ్ఞప్తి చేశారు. అలాగే వివాదాస్పద భూమిపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.

# నేరాలకు చెక్.. రాచకండ్రిగలో నిఘా నెట్‌వర్క్!

- అడుగడుగునా సీసీ కెమెరాలు.. ప్రజల భద్రతకు శ్రీ సిటీ పోలీసుల భరోసా
- ఎస్ఐ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు

**వరదయ్యపాలెం, పెన్ పవర్ ,అక్టోబర్ 07**
శ్రీ సిటీ, ఈనాటి వెలుగు:నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత భద్రత కల్పించడమే లక్ష్యంగా శ్రీ సిటీ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీ సిటీ ఎస్ఐ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాచకండ్రిగ గ్రామం, పరిసర ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
నేరాలపై నిఘా.. ట్రాఫిక్‌పై పర్యవేక్షణ
సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ట్రాఫిక్ కదలికలపై నిరంతర నిఘా ఉంచే అవకాశం కలగనుంది. ముఖ్యంగా గ్రామ పరిధిలో ఏదైనా నేర ఘటన చోటుచేసుకున్నప్పుడు కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులను త్వరగా గుర్తించేందుకు ఈ నిఘా వ్యవస్థ ఎంతగానో దోహదపడనుంది.
ప్రజల సహకారం అవసరం
**ఈ సందర్భంగా ఎస్ఐ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ** ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అన్నారు. నేరాలను ముందస్తుగానే అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.
పోలీసుల చర్యపై స్థానికుల హర్షంరాచకండ్రిగతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నేర నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్న శ్రీ సిటీ పోలీసులను, ఎస్ఐ సుధీర్‌రెడ్డిని




స్థానికులు అభినందించారు.సీసీ కెమెరాల నిఘాతో నేరాలకు అడ్డుకట్ట.. ప్రజలకు మరింత భద్రత అనే నమ్మకం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

# ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు నిదర్శనం

- కోవూరులో ‘సేవా జ్యోతి యాత్ర’లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- దేశం కోసం జీవితాన్నే అంకితం చేసిన గొప్ప నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ
- భావి తరాల బంగారు భవిష్యత్తు కోసం మోదీ నిరంతర శ్రమ
- బీజేపీ, జనసేన, టీడీపీ సమన్వయంతో సేవా జ్యోతి యాత్ర నిర్వహించడం సంతోషంగా ఉంది





**నెల్లూరు అక్టోబర్ 7 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన సుదీర్ఘ ప్రజా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ ‘సేవా సంకల్ప్ అభియాన్’లో భాగంగా ‘సేవా జ్యోతి యాత్ర’ను నిర్వహిస్తున్నట్లు కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుధవారం కోవూరులో నిర్వహించిన సేవా జ్యోతి యాత్ర ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను స్మరించుకుంటూ, ఆయన సేవా ప్రస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు.
ప్రజాసేవలో ఎక్కువ కాలం ఉండటం వేరు.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం వేరుదేశం కోసం జీవితాన్నే అంకితం చేసిన నాయకులు చాలా మంది ఉన్నారని, వారిలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఒకరని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఎక్కువ కాలం ఉండటం వేరని, ప్రజల జీవితాల్లో ఎక్కువ మార్పులు తీసుకురావడం వేరని అన్నారు. ఈ రెండింటి మధ్య ఉన్న స్పష్టమైన తేడాను అర్థం చేసుకోవాలంటే మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని తెలిపారు. వంటింట్లో మహిళల కష్టాల నుంచి దేశ సరిహద్దుల్లో శత్రువులపై క్షిపణులతో నిప్పులు కురిపించడం వరకు మోదీ నాయకత్వంలో దేశం అనేక మార్పులను చూసిందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అన్నారు. భారతదేశ మహిళల సింధూరాన్ని కాపాడటం కూడా తెలిసిన నాయకుడు మోదీ అని పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప నాయకుడిని కలిగి ఉండటం భారతదేశం చేసుకున్న అదృష్టమని అన్నారు.
భావి తరాల బంగారు భవిష్యత్తు కోసం నిరంతర శ్రమ
రాబోయే రోజుల్లో భావి తరాల భవిష్యత్తు, దేశం యొక్క బంగారు భవిష్యత్తు కోసం ప్రధాని మోదీ ఎంతో శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఆయనతో కలిసి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని అన్నారు. ముగ్గురు నాయకుల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిందని పేర్కొన్నారు. మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా కోవూరులో కూడా సేవా జ్యోతి యాత్ర నిర్వహించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే గారు అన్నారు. పాతికేళ్లుగా ఒక్కరోజు కూడా ఆగకుండా సాగిన మోదీ ప్రజాసేవను స్మరించుకుంటూ, ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ సేవా జ్యోతి యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
కష్టాల్లో ఉన్న గుజరాత్‌ను మార్చిన నాయకత్వం
మోదీ బాధ్యతలు చేపట్టిన సమయంలో గుజరాత్ రాష్ట్రం అనేక కష్టాలను ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తుచేశారు. కచ్ భూకంపం వేలాది కుటుంబాలను నిరాశ్రయులను చేసిందని, కరవుతో రైతులు కన్నీరు పెట్టుకున్నారని తెలిపారు. గుక్కెడు నీటి కోసం ఆడబిడ్డలు మైళ్ల దూరం నడవాల్సిన పరిస్థితులు ఉండేవని, చీకటిలో పల్లెలు మగ్గిపోయేవని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులను చూసి మోదీ వెనకడుగు వేయలేదని, వాటిని అధిగమిస్తూ గుజరాత్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారని ఎమ్మెల్యే అన్నారు. ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ ప్రజల కోసం పనిచేసిన గొప్ప నాయకుడిగా మోదీ ని అభివర్ణించారు.కూటమి పార్టీల సమన్వయంతో సేవా కార్యక్రమాలుభారతీయ జనతా పార్టీ, జనసేన, తెలుగుదేశం పార్టీ మూడు పార్టీలు కలిసి సేవా జ్యోతి యాత్ర నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ సేవా జ్యోతి యాత్ర ఆయన సేవా సంకల్పానికి అంకితమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ‘భారత్ మాతాకీ జై’ అంటూ నినదించారు.

# మున్సిపోల్స్ పై జగన్ సూపర్ స్పీడ్.. అందరికంటే ముందుగా అభ్యర్థుల ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి అన్న విషయం క్లారిటీ లేకపోయినా, ప్రతిపక్షం వైసీపీ దూకుడు చూపుతోంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము రెడీ అంటూ సంకేతాలు పంపుతోంది. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలోని ఇతర పార్టీలకన్నా ముందుగా అభ్యర్థుల ఖరారుపై దృష్టిపెట్టిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డిని ఎంపిక చేస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. పార్టీ అధినేత జగన్ రెడ్డి నేతృత్వంలో వైసీపీ నేతలు సమావేశమయ్యారు. ఇందులో అనేక విషయాలపై చర్చించిన పార్టీ నేతలు అధికార కూటమిని దీటుగా ఎదుర్కొనేలా అభ్యర్థులు ఎంపిక ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నెల్లూరు నుంచి విజయ్ కుమార్ రెడ్డిని రంగంలోకి దింపుతున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్దన్ రెడ్డి వెల్లడించారు.



### అధినేత సమీక్షలు

రాష్ట్రంలో అక్టోబరు, నవంబరు నెలల్లో స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవైపు రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న ప్రభుత్వం కోర్టు నిర్ణయం ఏవిధంగా ఉన్నా ఎన్నికల విషయంలో ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి అంచనా వేస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఆయన తాడేపల్లిలో వరుసగా జిల్లాల నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానికంగానే అభ్యర్థుల ఎంపిక చేసుకోవాలని స్వేచ్ఛ ఇచ్చిన అధినేత కొన్ని కీలక స్థానాల విషయంలో తానే స్వయంగా నిర్ణయం తీసుకుంటున్నారని అంటున్నారు.

### తొలి అభ్యర్థి ఆనం

స్థానిక ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతున్న నేపథ్యంలో పార్టీలు అప్రమత్తమయ్యాయి. సరైన అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ చేస్తున్నాయి. ఈ క్రమంలో వైసీపీ తొలి పేరు ప్రకటించింది. నెల్లూరు మేయర్ రేసులో ఆనం విజయ్ కుమార్ రెడ్డిని పోటీకి పెడుతున్నట్లు అధికారికంగా వెల్లడించింది. రిజర్వేషన్ ప్రక్రియపై స్పష్టత లేకపోయినా, అధికార పార్టీ నేతలు నెల్లూరు జనరల్ కేటగిరీలోకి వస్తుందన్న అంచనాతో అప్పుడే ప్రచారం చేసుకుంటున్నారని, తాము వెనకబడకూడదనే ఆలోచనతో మేయర్ అభ్యర్థిని ప్రకటిస్తున్నట్లు మాజీ మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ఇతర పార్టీలు ఏవీ ఇంతవరకు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం వెలువరించలేదు. కానీ, వైసీపీ మాత్రం అధికారికంగానే నిర్ణయం తీసుకోవడంతో మున్సిపోల్స్ కు ముందుగా దూసుకువచ్చినట్లు చెబుతున్నారు.

### కంగూరు పెడుతున్న కూటమి

స్థానిక ఎన్నికల విషయంలో కూటమి రాజకీయాలు విపక్షాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ఆ పార్టీ ఎన్నికల విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కాకపోయినప్పటికీ నెల్లూరు మేయర్ అభ్యర్థిని వైసీపీ ప్రకటించడం చూస్తుంటే, ఎన్నికలను ఆ పార్టీ ఎంత సీరియస్ గా తీసుకుందో అర్థమవుతోందని అంటున్నారు. అధికార పార్టీ ఇంతవరకు ఎవరినీ అభ్యర్థిగా ప్రకటించకపోయినా, స్థానిక నేతలు అంతా ఓ నిర్ణయం తీసుకుని ఓ నాయకుడిని మేయర్ అభ్యర్థిగా ప్రచారం చేసుకోమని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. దీంతో ఆయన నెల్లూరులో అందరినీ కలుస్తూ, మద్దతు కూడగట్టుకుంటున్నారని చెబుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసీపీ కూడా మేయర్ అభ్యర్థిని ముందుగా ప్రకటించాలని నిర్ణయం తీసుకుని వెనువెంటనే అమలు చేసినట్లుగా చెబుతున్నారు.

### ఆనం ఎందుకు?

నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నెల్లూరు నగరంలో ఆనం కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉండటంతో ఆ కుటుంబంలో ఒకరికి అవకాశం ఇవ్వాలని వైసీపీ నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఇదే సమయంలో కూటమిలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఇరుకన పెట్టేలా వ్యూహాత్మకంగా అడుగులు వేసిందని అంటున్నారు. నెల్లూరు కార్పొరేషన్ గా ఆవిర్భవించడానికి ముందు మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఆనం కుటుంబానికి చెందిన వివేకానందరెడ్డి సుదీర్ఘకాలం చైర్మనుగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ఎమ్మెల్యే అయ్యారు. ఈ కారణంగా నగరంలో ఆనం కుటుంబానికి ఉన్న ఆదరణను క్యాష్ చేసుకోవాలని వైసీపీ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇదే సమయంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందనే సంకేతాలు పంపడానికి ఆనం ఎంపిక నిదర్శనంగా చూపొచ్చునని అంటున్నారు.

# విజయసాయి గ్రౌండ్ వర్క్ సీరియస్ గానే ఉండే

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరో కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు ప్రజల ఎజెండాగా 15 అంశాలను ప్రకటించానని, ఈ నెల 8న తిరుపతిలో నిర్వహించనున్న తన నాలుగో ప్రెస్‌మీట్‌లో మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందుంచనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.కలియుగ దైవమైన తిరుమలేశ్వరుడి సన్నిధిలోని తిరుపతిని ఈ సమావేశానికి వేదికగా ఎంచుకున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. రాయలసీమ ఎదుర్కొంటున్న కరువు, ఎల్‌నినో ప్రభావం, ఉపాధి అవకాశాల కొరతతో జరుగుతున్న వలసలు వంటి అంశాలపై సమావేశంలో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు.అదే సమయంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న రెండు కుటుంబాలపై కూడా తన విమర్శలను కొనసాగించనున్నట్లు ఆయన సంకేతాలిచ్చారు. రాయలసీమ అభివృద్ధి, ప్రాంతీయ సమస్యలు, రాష్ట్ర రాజకీయాల్లో కుటుంబాల ప్రభావం వంటి అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. గతంలోనూ రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి, యువతకు అవకాశాలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు.మన సంస్కృతి, భారతీయతపై జరుగుతున్న దాడుల అంశాన్ని కూడా తిరుపతి సమావేశంలో ప్రస్తావిస్తానని విజయసాయిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలోనే ఒక వర్గం మైనార్టీగా మారిపోయే పరిస్థితి రాకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, దీనికి సంబంధించి మరో ఐదు ప్రతిపాదనలను ప్రజల ముందు ఉంచుతానన్నారు. అయితే ఆ ఐదు ప్రతిపాదనలు ఏమిటన్నది ఆయన ఇంకా వెల్లడించలేదు.విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రక్రియను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. విజయదశమి తర్వాత పార్టీని ప్రారంభించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని గతంలో వెల్లడించారు. పార్టీ విధానాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడం, నిత్యావసరాల



ధరలను తగ్గించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, విద్యుత్–విద్య–ఉద్యోగాలకు ప్రాధాన్యం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని కూడా ప్రకటించారు.ఇప్పటివరకు విజయసాయిరెడ్డి విజయవాడ, అనంతపురం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో తన రాజకీయ కార్యాచరణకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. రాయలసీమ తర్వాత ఉత్తరాంధ్రకు కూడా ప్రాంతీయ అభివృద్ధి, నీటి సమస్యలు, వలసలు, పరిశ్రమలు వంటి అంశాలపై ఆయన ప్రత్యేక ప్రతిపాదనలు వెల్లడించారు.ఈ నేపథ్యంలో తిరుపతిలో జరగనున్న నాలుగో ప్రెస్‌మీట్‌లో విజయసాయిరెడ్డి ప్రకటించబోయే ఐదు కొత్త ప్రతిపాదనలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. సమాజం కోసం ఆలోచించే మీడియా ప్రతినిధులు సమావేశానికి హాజరై తన ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.=

# టీడీపీ కార్యకర్తల కోసం పదవులు రిజర్వు.. 150 మందికి లోకేశ్ బంపర్ ఆఫర్

**తిరుపతి, అక్టోబరు 7, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీపై తనదైన ముద్రవేసేలా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కడప మహానాడులో కార్యకర్తే అధినేత అంటూ పిలుపునిచ్చిన లోకేశ్ ఇప్పుడు ఆ నినాదాన్ని నిజం చేసేలా అడుగులు వేస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న పార్టీ కోసం పనిచేసిన నాయకులను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, వారి కోసం నామినేటెడ్ పదవులను రిజర్వు చేయాలని నిర్ణయించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి ఆయన అనుమతి కూడా తీసుకున్నారని అంటున్నారు. దీంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేసిన సుమారు 150 మందికి త్వరలో నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయని అంటున్నారు.తెలుగుదేశం పార్టీలో తన ఆరంగేట్రం నుంచి నారా లోకేశ్ తనదైన ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు. తొలిసారిగా కార్యకర్తల సంక్షేమ నిధికి రూపకల్పన చేసి కార్యకర్తల మనసులను గెలుచుకున్నారు. ఆపద సమయంలో అపన్నహస్తం అందించేలా టీడీపీ సభ్యత్వం ఉన్నవారికి బీమా చేయించారు. ఆ తర్వాత కార్యకర్తల కోసం తాను ఉన్నానంటూ పలు కార్యక్రమాలను లోకేశ్ తీసుకువచ్చారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా కార్యకర్తలకు అందుబాటులో ఉండటమే కాకుండా, టీడీపీ కోసం పనిచేసి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య వంటివారి కుటుంబ సభ్యులకు వెన్నుదన్నుగా నిలిచారని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల్లోనూ కార్యకర్తలకు అగ్ర తాంబూలం దక్కాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు.



ఇక మంత్రి లోకేశ్ తీసుకున్న నిర్ణయంతో టీడీపీలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 150 మందికి త్వరలో పదవులు దక్కే అవకాశం ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 సెప్టెంబరులో తొలివిడతలో 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. వీరి పదవీ కాలం ఈ నెలతో ముగియనుందని అంటున్నారు. పార్టీలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలనే ఆలోచనతో ప్రస్తుతం పదవుల్లో ఉన్న చాలా మందికి రెన్యువల్ చేసే అవకాశం లేదని అంటున్నారు. వీరిస్థానంలో గత ప్రభుత్వంపై ధైర్యసాహసాలతో పోరాడి తెగువ చూపిన కార్యకర్తలకు పెద్దపీట వేయాలని వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు.2024లో రెండు విడతలు సుమారు 148 పదవులను భర్తీ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ పదవులు అన్నింటిని ఇప్పుడు కొత్తవారికి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. అయితే సహజంగా పదవుల కోసం ఏ పార్టీలో అయినా పైరవీలు ఉంటాయి. ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సుతోనే పదవులు కట్టబెట్టే సంస్కృతి ఇప్పటివరకు ఉందని పరిశీలకులు చెబుతున్నారు. టీడీపీ కూడా ఇప్పటివరకు ఇదే విధానాన్ని అవలంబించిందని అంటున్నారు. అయితే నారా లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఈ విధానాన్ని సంస్కరించాలని నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. సిఫార్సులు లేకుండా వచ్చే నెలతో ఖాళీ అయ్యే పదవులు అన్నింటిని భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ బహిరంగంగా ప్రకటించారు.పనితీరే ఆధారంగా కార్యకర్తల ఎంపిక ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెబుతున్నారు. గతంలో చేపట్టిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేసిన వారు, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సుపరిపాలనకు తొలి అడుగు, రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాల్లో బాగా పనిచేసిన వారిని గుర్తించనున్నట్లు చెబుతున్నారు. మొత్తం ఆరు అంశాలను పరిశీలించి కనీసం ఐదింటిలో మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేసిన వారికి పదవులు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. దీంతో మంత్రి లోకేశ్ నిర్ణయం పార్టీ వర్గాల్లో విస్తృత చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు.

## ఉత్తరాంధ్రలో వైసీపీ గ్రాఫ్ ఏమౌతోంది

**విశాఖపట్టణం, అక్టోబరు 7, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోటగా నిలిచిన ఉత్తరాంధ్ర లో ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేదు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత కుదురుకుంటుందని భావించినప్పటికీ, కీలక నేతల వరుస రాజీనామాలు, సస్పెన్షన్లతో పార్టీ గ్రాఫ్ పడిపోయింది. విజయనగరం జిల్లాలో పార్టీకి వెన్నెముకగా ఉన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్సీపీకి రాజీనామా చేయడంతో బొత్స సత్యనారాయణ ప్రాబల్యంపైనే పెద్ద ప్రశ్నమార్క్ పడింది. దానికి తోడు బడ్డుకొండ అప్పలనాయుడు సస్పెన్షన్, సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే దువ్వాడ శ్రీను పార్టీకి దూరం కావడంలాంటి కారణాలతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పార్టీ కొంత చేటు తెచ్చింది. ఇక .విశాఖపట్నం రాజకీయాలను పరిశీలిస్తే, ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ సహా పలువురు కీలక నేతలు వైఎస్సార్సీపీకి వీడ్కోలు పలికారు. మిగిలిన కొద్దిమంది సీనియర్ నాయకులు సైతం వైఎస్సార్సీపీ కార్యకలాపాలకు దూరంగా ఉండిపోయారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటమే కాకుండా, నూతనంగా పార్టీలో చేరేందుకు ఏ ఒక్క ద్వితీయ శ్రేణి నాయకుడు కూడా ఉత్సాహం చూపడంలేదు. అధిష్టానం ఎంత ఒత్తిడి తెచ్చినా క్షేత్రస్థాయిలో కేడర్ను సమాయత్తం చేసే నాయకులు కరువయ్యారు. శ్రీకాకుళం నుంచి విజయనగరం వరకు పార్టీని నడిపించాల్సిన సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రభావం కూడా ఇప్పుడు నామమాత్రంగానే మారిపోయింది. తన స్వంత మేనల్లుడైన మజ్జి శ్రీనివాసరావును కూడా పార్టీలో నిలుపుకోలేకపోయారనే విమర్శలు వైఎస్సార్సీపీ వర్గాల నుంచే వస్తున్నాయి. రీజినల్ కోఆర్డినేటర్లు, ఇన్చార్జులు వచ్చి సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, అవి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతున్నాయి.

ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత ప్రజల్లో ఉన్న ఆ వ్యతిరేకతను అధిగమించేందుకు వైఎస్సార్సీపీ రీ–బిల్డింగ్ ప్లాన్స్ ఏవీ ఉత్తరాంధ్రలో పనిచేయడం లేదు. ఓటమి నిరాశ నుంచి బయటపడకముందే వరుస వికెట్లు పడిపోతుండటంతో పార్టీ క్యాడర్ అయెఓమయంలో వుంది. సరైన నాయకత్వం, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయి పోరాటాలు లేకపోతే.. ఒకప్పుడు తన సొంత కోటగా భావించిన ఉత్తరాంధ్రలోనే వైఎస్సార్సీపీ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

## అసెంబ్లీ ఫార్ములా రగడ...

**ఒంగోలు అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ఇప్పుడు మరో కీలక రాజకీయ పరీక్షను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి సాధించిన విజయాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలన్న లక్ష్యంతో కూటమి నాయకత్వం వ్యూహరచనకు పదును పెడుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన సుదీర్ఘ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.అమరావతిలో దాదాపు రెండు గంటల పాటు జరిగిన భేటీలో స్థానిక ఎన్నికల్లో కూటమి ఎదుర్కొనే ప్రధాన సవాళ్లపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశం కేవలం సీట్ల పంపకాలపై చర్చకే పరిమితం కాలేదన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు టీడీపీ––జనసేన మధ్య సమన్వయం ఎలా ఉండాలి? ఏ పార్టీకి ఏ ప్రాంతంలో బలం ఉంది? మిత్రపక్షాల మధ్య పోటీ కారణంగా ఓట్లు చీలకుండా ఎలా చూడాలి? అనే అంశాలే అసలు ఎజెండాగా కనిపిస్తున్నాయి.సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రధాన కారణాల్లో టీడీపీ, జనసేన మధ్య సమన్వయం ఒకటి. ఇప్పుడు అదే ఫార్ములాను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అమలు చేయాలని నాయకత్వం భావిస్తోంది. అయితే స్థానిక ఎన్నికల స్వభావం అసెంబ్లీ ఎన్నికల కంటే భిన్నం. ఇక్కడ అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక వర్గ సమీకరణాలు, కుటుంబ రాజకీయాలు, గ్రామస్థాయి సంబంధాలు, స్థానిక నాయకుల మధ్య పోటీ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అందుకే రాష్ట్రస్థాయిలో కుదిరే అవగాహనను క్షేత్రస్థాయిలో అమలు చేయడం కూటమి నాయకత్వానికి అసలు సవాలుగా మారనుంది.ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన మధ్య ప్రత్యేక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం కీలకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి బలమైన కేడర్, సామాజిక ఆధారం, స్థానిక నాయకత్వం ఉందో అంచనా వేసి, అక్కడ ఆ పార్టీకి ప్రాధాన్యం ఇచ్చే విధానం తెరపైకి వస్తోంది.ఇది కేవలం సీట్ల సర్దుబాటు కాకుండా.. కూటమి ఓటు బ్యాంకును సమర్థంగా వినియోగించుకునే ప్రయత్నంగా చూడొచ్చు. ఒకే ప్రాంతంలో మిత్రపక్షాలు పరస్పరం పోటీ పడితే అధికార వ్యతిరేక ఓటుతో పాటు కూటమి ఓటు కూడా చీలిపోయే అవకాశం ఉంటుంది. ఈ ప్రమాదాన్ని ముందుగానే అడ్డుకోవడమే సమన్వయ కమిటీ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.పవన్ కళ్యాణ్‌తో సమావేశం అనంతరం చంద్రబాబు టీడీపీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక ఎన్నికల విషయంలో పార్టీ అంతర్గతంగా ఎలాంటి అసంతృప్తి తలెత్తకుండా చూడాలని చంద్రబాబు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, ఆశావహులు అసంతృప్తికి గురైతే దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో పడే అవకాశం ఉంది. అందుకే వ్యక్తిగత ప్రయోజనాల కంటే కూటమి ప్రయోజనాలే ముఖ్యమని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తోంది.స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి కేవలం మరో ఎన్నిక కాదు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ––జనసేన భాగస్వామ్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు బలపడిందో తేల్చే పరీక్ష కూడా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కనిపించిన ఐక్యతను గ్రామస్థాయి రాజకీయాల్లో కొనసాగించగలిగితే కూటమి మరింత బలపడే అవకాశం ఉంటుంది.అయితే స్థానిక ఎన్నికల్లో వ్యక్తిగత ఆశలు, స్థానిక ఆధిపత్య పోటీలు, టికెట్ల కోసం పోటీ పెరగడం సహజం. ఈ విభేదాలను ఎంత సమర్థంగా పరిష్కరిస్తారన్నదే కూటమి విజయానికి కీలకంగా మారనుంది.మొత్తంగా చంద్రబాబు––పవన్ భేటీని చూస్తే.. స్థానిక ఎన్నికల్లో ఎవరు ఎన్ని స్థానాలు గెలుస్తారనే దానికంటే ముందుగా కూటమి భాగస్వామ్య పక్షాలు ఒకరినొకరు ఎంతవరకు సమన్వయం చేసుకుంటాయన్నదే అసలు రాజకీయ కథగా మారుతోంది. గ్రామస్థాయిలో ఈ సమన్వయం సక్సెస్ అయితే స్థానిక ఎన్నికల ఫలితాలు కూటమికి మరో పెద్ద రాజకీయ బలంగా మారే అవకాశం ఉంది.

# గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

**విజయవాడ, అక్టోబరు 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జీఎస్టీ వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది.2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జీఎస్టీ వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జీఎస్టీ వృద్ధి రేటు సాగటు 8 శాతం గా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జీఎస్టీ వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది.ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జీఎస్టీ రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది.ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొత్తంగా చూస్తే జీఎస్టీ వసూళ్లలో ఏపీ నమోదు చేస్తున్న అభివృద్ధి రాష్ట్ర ప్రజలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిణామం లాగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఇదే ధోరణి కొనసాగితే ఏపీ రాష్ట్రం ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధిస్తుంది. సమర్థవంతమైన నాయకత్వం.. ఆర్థిక అంశాలలో పొదుపు వల్ల ఈ స్థాయిలో వసూళ్లు సాధ్యమయ్యాయి. కాగా, ఏపీ ఖజానా ఇలా కావడం.. జగన్ కు మింగుడుపడని వార్త అని టీడీపీ నాయకులు అంటున్నారు.

# 2027 వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైర్ అవ్వడా? ఇంగ్లండ్ మాజీ స్టార్ సంచలన కామెంట్స్

- 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని ఇప్పటికే ప్రకటించిన కోహ్లీ
- అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చన్న పనేసర్
- విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉందని వ్యాఖ్య
- అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని తనకు అనిపించడం లేదన్న పనేసర్
- రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని ప్రశంస



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లీ శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10-15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లీ కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు.

మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు. "రోహిత్ అద్భుతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లోకి వస్తే బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేయగలడు. భారత్‌కు అతడి లాంటి నాణ్యమైన ఆటగాడు అవసరం" అని పనేసర్ చెప్పాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్: శ్రేయస్‌కు కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్.. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు

- వెస్టిండీస్‌పై సెంచరీతో టీ20 ర్యాంకింగ్స్‌లో 7వ స్థానానికి శ్రేయస్
- టీ20 టాప్-10లో ఇషాన్, అభిషేక్, శ్రేయస్, తిలక్ వర్మ
- డబుల్ సెంచరీతో వన్డేల్లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న శుభ్‌మన్ గిల్
- వన్డే బ్యాటింగ్ టాప్-10లోకి తిరిగి ప్రవేశించిన కేఎల్ రాహుల్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు.
నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు. ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరపున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం.

**అగ్రస్థానంలో గిల్ పదిలం**

మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు.

**మళ్లీ నం.01 స్థానానికి రషీద్ ఖాన్**

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు.
ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.

# 2036 ఒలింపిక్స్‌పై భారత్ మాస్టర్ ప్లాన్.. అహ్మదాబాద్ నుంచి బిడ్ ప్రక్రియ షురూ!

2036 సంవత్సరంలో జరిగే ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడల ఆతిథ్య వేదికను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా.. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (xూజ) ప్రకటించిన నగరాలు, దేశాల జాబితాను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (xూూ) సాదరంగా స్వాగతించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ (ూఎఝఝు) కేంద్రంగా భారత్ తన ఒలింపిక్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తోంది. గత 18 నెలలుగా ఐఓసీతో జరిపిన నిరంతర సంప్రదింపుల ద్వారా ఈ ప్రణాళిక రూపుదిద్దుకుంది.

**రైజింగ్ టు గెదర్ నినాదంతో ముందుకు..**

భారతదేశం ఎంచుకున్న రైజింగ్ టుగెదర్ దృక్పథం.. క్రీడల ద్వారా దేశం రూపాంతరం చెందడం, ఒలింపిక్ ఉద్యమ భవిష్యత్తు కలిసికట్టుగా కొనసాగాలనే నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం కేవలం ఒక గ్లోబల్ ఈవెంట్‌ను నిర్వహించడమే కాకుండా, క్రీడలను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడానికి ఒక చారిత్రక అవకాశం. కోట్లాది మంది యువతను కేవలం క్రీడలను వీక్షించే స్థాయి నుంచి వాటిని ఆచరించే స్థాయికి తీసుకెళ్లడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం.

**ఒలింపిక్ ఉద్యమానికి నూతన శకం**

ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా, అత్యుత్తమ డిజిటల్ నెట్‌వర్క్ కలిగిన భారత్‌కు ఒలింపిక్స్ ఆతిథ్యం దక్కితే అది ఒలింపిక్ ఉద్యమానికి ఒక కొత్త శకం అవుతుందని ఐఓసీ భావిస్తోంది. వంద కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలోకి ఒలింపిక్స్ ప్రవేశించడం వల్ల కొత్త అథ్లెట్లు, కొత్త ప్రేక్షకులు, కొత్త భాగస్వాములు ఒలింపిక్ కుటుంబానికి లభిస్తారు. భారతదేశం యొక్క సాంస్కృతిక వైవిధ్యాన్ని ఈ వేడుక ప్రపంచానికి చాటిచెప్పనుంది.

**పీటీ ఉష, మన్సుఖ్ మాండవ్య హర్షం:**

ఐఓఏ అధ్యక్షుడు పీటీ ఉష మాట్లాడుతూ.. 2036 ఒలింపిక్స్ కోసం భారత్ కంటున్న కలలను ఐఓసీ గుర్తించడం మాకు అత్యంత గర్వకారణం. రైజింగ్ టు గెదర్ అనేది కేవలం నినాదం కాదు, అంకితభావంతో కూడిన శక్తి.. అక్టోబర్ చివరి వరకు ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు మా ఆశయాలను ప్రదర్శించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని తెలిపారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవ్య మాట్లాడుతూ.. క్రీడలు మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలవు.. ఒలింపిక్స్ నిర్వహణ ద్వారా మిలియన్ల మంది యువతను క్రీడల వైపు ప్రోత్సహించవచ్చు.. దేశంలో ప్రతి సామాజిక వర్గానికి క్రీడా పరివర్తనను తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. త్వరలోనే ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ఎదుట భారత్ తన అధికారిక ప్రణాళికను ప్రదర్శించనుంది.

# ఆ విషయంలో జక్కన్న కంటే సుకుమార్ ఉత్తమంగా!

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడిగా రాజమౌళి స్థానం తిరుగులేనిది. తన ఊహాశక్తితో, విజువల్ వండర్స్‌తో -ఆర్‌ఆర్‌ఆర్- మూవీతో ఆస్కార్ వేదిక వరకు బాహుబలిలా జెండా పాతారు. అయితే దర్శకుడిగా వంద శాతం సక్సెస్ రేట్ ఉన్న రాజమౌళి సమర్పకుడిగా , ప్రొడ్యూసర్‌గా వస్తున్న సినిమాల విషయంలో మాత్రం అనుకున్న స్థాయిలో మ్యాజిక్ రిపీట్ చేయలేకపోతున్నారనే చర్చ సినీ వర్గాల్లో గట్టిగా నడుస్తోంది. తాజాగా ఆయన సమర్పణలో ఫహద్ ఫాసిల్ కథానాయకుడిగా రూపొందిన -డోంట్ ట్రబుల్ ది ట్రబుల్- సైతం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. గతాన్ని పరిశీలిస్తే రాజమౌళి సమర్పణ తోడైన చిత్రాల్లో -విశాఖ ఎక్స్‌ప్రెస్-, -రాజన్న-, -అందాల రాక్షసి-, -బ్రహ్మాస్త్ర- (తెలుగు వెర్షన్) వంటి సినిమాలున్నా? ఇవేవీ బాక్సాఫీస్ వద్ద పెద్ద సంచలనాలు నమోదు చేయలేకపోయాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్ వల్ల ప్రారంభ వసూళ్లు లభించినా? కంటెంట్ పరంగా ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇదే కోవలో సొంత బ్యానర్ -సుకుమార్ రైటింగ్స్- ద్వారా సినిమాలను నిర్మిస్తున్న మరో దిగ్గజ దర్శకుడు







సుకుమార్ మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో దూసుకుపోతున్నారు. సుకుమార్ నిర్మాతగానే కాకుండా శిష్యులకు, యువ దర్శకులకు అవకాశాలు ఇస్తూ కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. -కుమారి 21ఎఫ్- మొదలైన విజయయాత్ర -ఉప్పెన-, -విరూపాక్ష- వంటి భారీ బ్లాక్‌బస్టర్ల వరకు నిరాటంకంగా కొనసాగింది. స్క్రిప్ట్ ఎంపిక చేయడం, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడంలో సుకుమార్ తీసుకునే జాగ్రత్తలే ఆయన బ్యానర్‌ను సక్సెస్ రూట్‌లో ఉంచాయన్నది కాదనలేని నిజం. దర్శకుడిగా రాజమౌళి శిఖరాగ్రాన ఉన్నా? సమర్పకుడిగా.. నిర్మాతగా కంటెంట్ ఎంపిక, సక్సెస్ రేట్ విషయంలో మాత్రం జక్కన్న కంటే సుకుమారే మెరుగైన స్థానంలో ఉన్నార నడంలో సందేహం లేదు. ప్రత్యేకించి సుకుమార్ శిష్యులు గొప్ప దర్శకులుగా ఎదుగుతున్నారు. అతడి కాంపౌండ్ నుంచి వచ్చిన వారంతో సొంతంగా సినిమాలు చేస్తున్నారు. వాటికి సుకుమార్ ఏదో రూపంలో సహకారం అంది స్తున్నారు. కానీ ఇంత వరకూ రాజమౌళి స్కూల్ నుంచి బయటకు వచ్చి సక్సెస్ అయిన దర్శకులు లేరు. జక్కన్న వద్ద చాలా మంది పనిచేసారు. కానీ వాళ్లెవ్వరు సక్సెస్ అవ్వలేదు. తన అసిస్టెంట్..అసోసియేట్ దర్శకుల గురించి రాజమౌళి ఫోకస్డ్ గా చెప్పింది కూడా పెద్దగా లేదు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965